# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-12-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. విభిన్న ప్రతిభావంతులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.
2. 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్'-హిల్ట్ విధానంపై తెలంగాణ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు.
3. ఆంధ్రప్రదేశ్ లోని ఉప్పాడ ప్రాంతంలో సముద్ర జలాల కాలుష్య సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.
4. ఆంధ్రప్రదేశ్ లోని నగరాల్లో వ్యర్థాల నిర్వహణకు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు.
5. ప్రముఖ చలనచిత్ర నేపథ్య గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి ఈరోజు.

============================

విభిన్న ప్రతిభావంతులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో నిన్న ఆయన పాల్గొని వారికి ఉపకారవేతనాలను పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, అన్ని రంగాల్లో విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహిస్తామన్నారు. వారి సంక్షేమం కోసం ప్రత్యేక ఆర్థిక రాయితీ రుణ పథకాన్ని పునరుద్ధరిస్తామని చంద్రబాబు నాయుడు పేర్కొంటూ,

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

నేషనల్ జియోస్పేషియల్ నాలెడ్జ్-బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హాబిటేషన్స్-నక్షా పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు కేంరద ప్రభుత్వం 125 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. పట్టణ భూసమీకరణ వ్యవస్థను ఆధునికీకరించడంలో చూపిన ప్రగతికి కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు నిధులు మంజూరు చేసిందని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. రాష్ట్రంలోని 10 పట్టణ, స్థానిక సంస్థల్లో చూపిన విశేష పురోగతికి గుర్తింపుగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నిధులు మంజూరు చేసిందని పేర్కొన్నారు. పట్టణాల్లో భూములు, స్థలాలపై కచ్చితమైన రికార్డుల తయారీ,

రికార్డుల నవీకరణ ద్వారా వివాదాలను పరిష్కరించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం నక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

---------------------------

'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్'-హిల్ట్ విధానంపై తెలంగాణ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. ఢిల్లీలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, పారిశ్రామికవాడలో పనిచేస్తున్న వారిని దృష్టిలో ఉంచుకని చర్చించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. హిల్ట్ విధానం పారిశ్రామికవేత్తలకు మాత్రమే లబ్ధి చేకూరుస్తోందని విమర్శించారు. హైదరాబాద్ పారిశ్రామిక ప్రాంతాల్లో వాణిజ్య సముదాయాలకు అనుమతిస్తే ట్రాఫిక్ సమస్యల అధికమవుతాయని ఈ విధానంపై మరోసారి పరిశీలించాలని కోరారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని ఉప్పాడ ప్రాంతంలో సముద్ర జలాల కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఉప్పాడ మత్స్యకారులతో- 100 రోజుల ప్రణాళిక అమలు, భవిష్యత్తు కార్యాచరణ, ఆదాయం పెంపు అనే అంశాలపై నిన్న చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, సముద్ర తీరంలో కాలుష్య సమస్యపై నిపుణుల బృందం పూర్తిస్థాయి అధ్యయనం చేస్తుందని చెప్పారు.

---------------------------

కాశీ తమిళ సంగమం 4.0లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేందుకు వీలుగా.. కన్యాకుమారి, చెన్నై, కోయంబత్తూరు, కాశీ నగరాల మధ్య ప్రత్యేక రైళ్లను భారతీయ రైల్వే నడుపుతోంది. నవంబరు 29న కన్యాకుమారి నుంచి బయలుదేరిన మొదటి రైలుతో ఈ సర్వీసులు ప్రారంభమయ్యాయి. ఈ నెల 6న చెన్నై నుంచి, 7వ తేదీన కన్యాకుమారి నుంచి, 9న కోయంబత్తూరు నుంచి, ఈ నెల 12న చెన్నై నుంచి ఈ రైళ్ళ రాకపోకలు సాగిస్తాయని రైల్వేశాఖ తెలిపింది. అలాగే తిరుగు ప్రయాణానికి కాశీ నుంచి ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసింది. రేపు కన్యాకుమారికి, ఈ నెల 7న చెన్నైకి, 9న కోయంబత్తూరుకు తిరుగు ప్రయాణమవుతాయని తెలిపింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని నగరాల్లో వ్యర్థాల నిర్వహణకు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి – తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న పనులపై మంగళగిరిలో నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం కార్పొరేషన్‌కు చెందిన కంపోస్ట్ యార్డును మంత్రి గత రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ,

వాయిస్ 29 సెకన్లు

---------------------------

ఆబాల గోపాలాన్ని తన గానంతో అలరించి, తెలుగు పాటకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తీసుకొచ్చిన అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి ఈరోజు. సంగీత దర్శకుడిగా, నేపథ్య గాయకుడిగా, బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ఘంటసాల 1922 డిసెంబర్ 4వ తేదీన కృష్ణా జిల్లా గుడివాడ వద్ద చౌటపల్లి గ్రామంలో జన్మించారు. ఆ గాన గంధర్వుడు తెలుగుతో సహా పలు భాషల్లో ఆలపించిన గీతాలు నేటికి శ్రోతల

మనసులను రంజింపజేస్తున్నాయి. తన ఆఖరి శ్వాస వరకు గానాన్ని కొనసాగిస్తానని ఘంటసాల ఒక సందర్భంలో పేర్కొంటూ...

వాయిస్ – 30 సెకన్లు

-----------------------------

రెండవ దశ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ –సర్‌లో భాగంగా గుజరాత్‌లో 82 శాతానికి పైగా ఓటర్ ఫారంలు డిజిటలీకరణ చేశామని గుజరాత్ ప్రధాన ఎన్నికల అధికారి హరిత్ శుక్లా తెలిపారు. గాంధీనగర్‌లో బిజెపి, కాంగ్రెస్, ఆప్, బిఎస్‌పితో సహా అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన నిన్న సమావేశం నిర్వహించి, ప్రత్యేక సవరణ పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా హరిత్ శుక్లా మాట్లాడుతూ ఈ నెల 11 వరకు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రచారం కొనసాగుతుందని, ఈ నెల 16న తుది ముసాయిదా ఓటర్ల జాబితాని వెల్లడిస్తామని తెలిపారు.

-----------------------------

ప్రకృతి వ్యవసాయానికి రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వి.అనిత సూచించారు. అనకాపల్లి జిల్లా ఎస్. రాయవరం మండలం గుడివాడ గ్రామంలో స్థానిక రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంపై రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. రైతుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, తుఫానులో నష్టపోయిన ప్రతి రైతును ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.'

-----------------------------

ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి తీరాల్లో కొనసాగుతున్న అల్పపీడనం ఈరోజు మరింత బలహీనపడనుందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజులపాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజేస్తూ,

వాయిస్..25 సెకన్లు

మరోవైపు.. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చలితీవ్రత కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని మన్యం ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తెలంగాణాలోని ఆదిలాబాద్ జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదవుతోంది.

=====================